క్లుప్తంగా

'నిథమ్'లో పర్యాటక దినోత్సవ సంబరాలు-2023

- నాలుగు రకాల పోటీలు..
- ఈనెల 15వ తేదీ వరకు అవకాశం

రాయదుర్గం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్), రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ(టీఎస్‌టీడీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రకాల పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఫొటోగ్రఫీ పోటీలకు ఏర్పాట్లు చేశారు.ఫొటోగ్రఫీలో విజేతలకు ప్రథమ బహుమతి రూ 20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, షార్ట్ ఫిల్మ్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహమతి రూ.10వేలు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఫొటోగ్రఫీల విజేతలకు రూ,10, రూ.5వేలు, రూ 3వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి కింద అందిస్తారు. ఈ పోటీలలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు కోసం https.nithm.ac.in/registration.php లో చేసుకోవాలి. హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక, ఆతిథ్యరంగాలకు చెందిన అంశాలకు సంబంధించిన వాటిని పంపాలి. ఒక్కరు ఒక ఎంట్రీని మాత్రమే పంపడానికి అవకాశం ఉంటుంది. డాక్యుమెంటరీ ఫిల్మ్ సమర్పణలు 20 నుంచి 30 నిమిషాల నిడివి ఉండాలి. షార్ట్ ఫిల్మ్ సమర్పణ 10 నుంచి15 నిమిషాల మధ్య ఉండాలి. రీల్స్ 90 సెకన్లకు మించకూడదు. ఫోటోగ్రఫీ ఎంట్రీలను జేపీఈజీ లేదా పీఎన్‌జీ ఫార్మాట్‌లో హై రెజల్యూషన్ ఇమేజ్‌లుగా పంపాలి.తమ సమాచారం, పోటీలకు పంపే ఎంట్రీలను పంపడానికి గడువు తేదీ సెప్టెంబర్ 15వ తేదీ. విజేతలను సెప్టెంబర్ 25వ తేదీ ప్రకటిస్తారు. ఈ పోటీలలో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చు.

హస్తకళలు, చేతివృత్తులకు చేయూత

ఎంఎస్‌ఎంఈ అదనపు అభివృద్ధి కమిషనర్ చంద్రశేఖర్



మాదాపూర్: ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకం భారతీయ హస్తకళా సాంప్రదాయాలను పునరుద్ధరిస్తుందని, కళాకారులను ప్రోత్సహిస్తుందని భారతప్రభుత్వ ఎంఎస్‌ఎంఈ అదనపు అభివృద్ధి కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న పారిశ్రామిక, ఇండెక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హస్తకళాకారులు, చేతివృత్తుల వారికి రుణాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న పీఎం విశ్వకర్మ పథకాన్ని సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. వరంగల్‌లో ఈ పథకాన్ని వివిధ మంత్రులు ప్రారంభిస్తారన్నారు. చేతివృత్తి దారులకు 5 శాతం తక్కువ వడ్డీ రేటుతో రూ.లక్ష వరకు రుణాలను అందజేస్తుందన్నారు. ఇండోర్ ఇన్ఫోలైన్ ఎండీ ఎక్స్‌పో నిర్వాహకుడు రాజ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ ఇండెక్స్‌పో పరిశ్రమ నిపుణులు, ఔత్సాహికులు , తయారీ పరిశ్రమలో తాజా పురోగతులపై చర్చిస్తామన్నారు. ఈ ప్రదర్శనలో 100 మంది ఎగ్జిబిటర్లు, హ్యాండ్‌టూల్స్, మెషీన్ టూల్స్, రోబోటిక్స్, ఇండస్ట్రియల్ ఆటోమెషీన్, సోలార్ పవర్‌ప్లాంట్స్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, సెఫ్టీ ఉత్పత్తులు ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రవేశం ఉచితమని, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

అల్లాపూర్ డివిజన్‌లో...

అన్ని వసతులు కల్పించాం

పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యేకు తిలకం దిద్దుతున్న మహిళ



అల్లాపూర్ డివిజన్‌లోని కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ బస్తీ, పల్లె దవాఖానాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో సుమారు రూ.50లక్షలతో నిర్మించనున్న దవాఖానా పనులకు కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి శంకుస్థాపన చేశారు.

◆ అనంతరం పండిట్ నెహ్రూనగర్‌లో ఆర్‌కే సొసైటీ, కేజీఆర్ నగర్, ఫ్రెండ్స్ కాలనీ, సెంట్రల్ అల్లాపూర్ నుంచి మహబూబ్ ఫంక్షన్‌హాల్ వరకు పాదయాత్రగా వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లాపూర్ డివిజన్‌లోని ప్రతి బస్తీ కాలనీల్లో మౌలిక వసతులైన మంచినీరు విద్యుత్, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీలను నూటికి నూరు శాతం ఏర్పాటు చేశామన్నారు. అవసరం ఉన్న చోట నివేదికలు పంపిస్తే వెంటనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

పాదయాత్రలో దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలి

◆ పాదయాత్రలో తెలుసుకున్న ప్రతి సమస్యను వెనువెంటనే ప్రణాళికలు సిద్ధం చేసి ఆయా శాఖల సిబ్బందిచే నివేదికలు తయారు చేయించి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కారమయ్యేంత వరకు సంబంధిత అధికారి, స్థానిక కార్పొరేటర్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా అల్లాపూర్‌లో నీటి సమస్య ఉండేదని నేడు రిజర్వాయర్ నిర్మాణంతో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. గాయత్రినగర్‌లో స్టేడియం నిర్మాణం చేపట్టడంతో క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. అదే విధంగా ఆర్‌కే సొసైటీలో షటిల్ కోర్టు సైతం ప్రారంభించామన్నారు. ఇంకా డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా చేపడతామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహాయ సహకారాలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంతో తీర్చిదిద్దామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్ కిట్స్ అందజేశామన్నారు.

కూకట్‌పల్లి గ్రామం రుణం తీర్చుకున్నా: ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్‌లోని ఏవీబీ పురం, మైత్రినగర్, విజ్ఞాన్‌పురి కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిలలు పూలమాలలతో, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి తన పుట్టిన ఊరు అని, చిన్ననాటి నుంచి తన ఊరు రుణం ఏ విధంగా తీర్చుకుందామని అనుకునేవాడినని, రాముని దయవల్ల రామాలయ పునర్నిర్మాణం, కూకట్‌పల్లి గ్రామంలోని చిత్తారమ్మ దేవాలయంతో పాటు అన్ని మతాల వారికి తన వంతు సహాయం చేసే స్థితికి తీసుకురావడం తన అదృష్టమన్నారు. కూకట్‌పల్లి డివిజన్‌లో అన్ని మౌలిక సదుపాయాలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూశామని, చిన్న చిన్న ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించుకొని ముందుకు వెళుతున్నామని తెలిపారు. అనంతరం ప్రశాంత్‌నగర్‌లోని రెండున్నర కోట్ల రూపాయలతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ తిమ్మారెడ్డి, వివిధ విభాగాల అధ్యక్షుడు దేవిరెడ్డి మస్తాన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ..

ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం హర్షణీయం



పీజేఆర్ నగర్‌లోని ఆరోగ్యశ్రీ కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్రంలోని ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు కేసీఆర్ ప్రభుత్వం శుభవార్త చెప్పిందని.. వైద్య సేవల పరిమితిని రూ.2లక్షల నుంచి 5 లక్షలకు పెంచిందని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి పీజేఆర్‌నగర్ ఫేజ్ 2లో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు ఇ-కేవైసీ నమోదు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీ వైద్య సేవల పరిమితిని 5 లోలకు పెంచి, పూర్తి ఉచితంగా కుటుంబం మొత్తాన్ని ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే వీలు కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వైద్యంపై మరింత దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు పేదవాడికి అవసరం అయ్యే నిర్ణయాలు తీసుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీహెచ్. భాస్కర్, ముజీబ్, వాలి నాగేశ్వర రావు, వాసుదేవరావు, ఐలయ్య గౌడ్, మహేష్, సాయిగౌడ్, జానయ్య, తిరుపతి, రాజ్యలక్ష్మి, మధులత, నస్రీన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం



ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అంజిరెడ్డి

మోతీనగర్: ఎలాంటి దీర్ఘకాలిక నొప్పులైనా ఫిజియోథెరపీతో నయం అవుతుందని మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ మాజీ అధ్యక్షుడు నల్లమాల్పు అంజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా మోతీనగర్ కమ్యూనిటి హాలులో ఎస్ఆర్ఐ ఫౌండేషన్, మోతీనగర్ కో ఆపరేటివ్ లిమిటెడ్, సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కేంద్రంలో ఆయన రోగులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఉచితంగా సేవలనందిస్తున్న ఎస్ఆర్ఐ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు జీతం అందజేత



ఉపాధ్యాయులకు చెక్కులను అందజేస్తున్న సత్యం శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంకేపీహెచ్‌బీ కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజకుమారి ఇద్దరు ఉపాధ్యాయులు, వాచ్‌మెన్‌ను ప్రైవేట్‌గా ఏర్పాటు చేసుకున్నారు. వీరికి నెలవారి జీతాలను అందజేయాలని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగంను కోరారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆగస్టు నెల వేతనాన్ని ఫౌండేషన్ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సత్యం శ్రీరంగంకు కృతజ్ఞతలు తెలిపారు.

రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ ప్రారంభం



ప్రగతినగర్‌లో రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో వస్త్రాలను అందించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ఎమ్మెల్యే మేయర్ నీలారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ యజమానులపై చర్యలు తీసుకోవాలి



పోలీసులకు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

భాగ్యనగర్‌కాలనీ: అడ్డగుట్ట సొసైటీలో నిర్మాణంలో ఉన్న భవనం పిట్టగోడ కూలి ఒరిస్సాకి చెందిన ముగ్గురు కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. భవన నిర్మాణం పనుల్లో భాగంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే కార్మికులు ఆరో అంతస్తు నుంచి పడి మృతి చెందారు. భవన నిర్మాణ యజమానులు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అదే విధంగా మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారం కల్పించాలని కేపీహెచ్‌బీ పోలీసులకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నేతలు వెలగ శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్ రెడ్డి, హైదర్‌నగర్ డివిజన్ జనరల్ సెక్రటరి కృష్ణంరాజులు ఉన్నారు.

నవంబరులో డ్రీమ్ హ్యాక్ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే పేరొందిన డిజిటల్ ఫెస్ట్...డ్రీమ్ హ్యాక్ నగరంలో జరుగనుంది. తమ 4వ ఎడిషన్‌ను నగరంలో నిర్వహించనున్నట్టు నిర్వాహక సంస్థ నోడ్విన్ గేమింగ్, ఇఎస్ఎల్ ఫేసెట్ గ్రూప్ ప్రతినిధులు తెలిపారు. వచ్చే నవంబరు 3న మాదాపూర్‌లోని నొవోటెల్ హోటల్ వేదికగా ఈ ఫెస్ట్ ప్రారంభం అవుతుందని, 3 రోజుల పాటు ఆసక్తికరమైన గేమింగ్-పాప్ కల్చర్, అత్యాధునిక టెక్నాలజీ విశేషాలు... ఇవన్నీ ఈ ఈవెంట్‌లో చోటు చేసుకోనున్నాయన్నారు.

భవిష్యత్ సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే

హెచ్‌సీయూ ప్రొఫెసర్ మీనా హరిహరన్



మాట్లాడుతున్న మీనా హరిహరన్

శేరిలింగంపల్లి: భవిష్యత్ సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మీనా హరిహరన్ తెలిపారు. ఫ్రెండ్స్ అసోసియేషన్, జెమ్ మోటార్స్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం టీచర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మీనా మాట్లాడుతూ విశ్వంలో గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులలోని అజ్ఞానాన్ని తొలగించి, జీవిత విలువలు తెలియజేసి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతారన్నారు. నేటి యువత, రాధాకృష్ణనన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, విద్యా విధానంలో వస్తున్న మార్పులను గుర్తించాలన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని సూచించారు. అంతకు ముందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ మీనా హరి హరన్‌ను శాలువాతో సన్మానించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి, జెమ్ మోటార్స్ ఛైర్మన్ ఇ.రాజుయాదవ్, మాదాపూర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బసవలింగం, అసోసియేషన్ ప్రతినిధులు కౌండిన్యశ్రీ, వెంకటేశ్వరరాజు, విష్ణుప్రసాద్, జనార్ధన్, పాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పదాలను అనువదించడం అవసరం

రాయదుర్గం: సాంకేతిక పదాలను భారతీయ భాషలకు అనువదించడం అవసరమని నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్ (ఎన్‌టీఎం) ఇన్‌చార్జీ అధికారి డాక్టర్ తారీఖ్‌ఖాన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ అప్‌లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ (సీఏఎల్‌టీఎస్), హెచ్‌సీయూ, ఎన్‌టీఎం, సీఐఐఎల్ మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ భాషలలో అనువాద సమానమైన వాటి పరిశీలన' అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనువాదం యొక్క స్పష్టత, సమర్థతపై దృష్టి పెట్టాలని, అందుకోసం ఆలోచనాత్మక, శక్తివంతమైన చర్చలను వర్క్‌షాప్‌ల ద్వారా జరపాలని సూచించారు. సీఏఎల్‌టీఎస్ విభాగం అధ్యాపకులు, వర్క్‌షాప్ సమన్వయకర్త డాక్టర్ నరేష్ అన్నెం, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న హెచ్‌సీయూ, ఎన్‌టీఎం, సీఐఐఎల్ ప్రతినిధులు

కూకట్‌పల్లి బీజేపీ అభ్యర్థిగా వడ్డేపల్లి దరఖాస్తు



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుక్రవారం తన అనుచరగణంతో పెద్ద ఎత్తున బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలి వెళ్లారు. ముందుగా ఆయన తండ్రి కీర్తిశేషులు వడ్డేపల్లి నర్సింగరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కార్యాలయంలో అభ్యర్థిత్వానికి సంబంధించిన దరఖాస్తు పత్రాలను రాష్ట్ర నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పెద్దలు తనకు అవకాశం కల్పిస్తే ఖచ్చితంగా గెలిచి రాష్ట్ర అధినాయకత్వానికి బహుమతిగా ఇస్తానన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అవకాశం తనకు ఇవ్వాలని కోరారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని రవీంద్రభారతి పాఠశాల బ్రాంచ్‌లో శుక్రవారం గ్రాండ్ పేరెంట్ డే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు పాఠశాలను ఉద్దేశిస్తూ అన్న సిద్ధాంతాన్ని అనుసరిస్తూ పాత విలువలను ఆచరిస్తూ కొత్త విద్యా పద్ధతులను పాటిస్తూ విద్యార్థుల నవ చైతన్యానికి వికాసానికి మూలం నిదర్శనం రవీంద్ర భారతి పాఠశాల అని, అలాగే విద్యార్థుల అభివృద్ధికి ప్రథమ కర్తవ్యం క్రమశిక్షణ, మంచి నడవడిక అని విద్యార్థులకు నైతిక విలువల గురించి తెలిపారు. ఈ సందర్భంగా పెద్దలను ఉద్దేశిస్తూ ప్రధానోపాధ్యాయురాలు పెద్దలను గౌరవించాలన్నారు. అనుభవాలు, సలహాలు మన సమాజాన్ని దేశానికి, విద్యార్థులకు ఎంతో అవసరమని, పెద్దల సలహాలను అనుసరిస్తూ ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు తమ ఆటపాటలతో పెద్దలను అబ్బురపరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తాతలు, అమ్మమ్మలు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రవీంద్ర భారతిలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకల్లో విద్యార్థులు తాతలు, అమ్మమ్మలు

ట్రాఫిక్ చక్రబంధంలో కైత్లాపూర్ రోడ్డు

నిత్యం నరకం చూస్తున్న స్థానికులు, వాహనదారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



కైత్లాపూర్ రోడ్డులో భారీ ట్రాఫిక్ జామ్(ఫైల్ ఫొటో)

మూసాపేట: వాహనదారులు, ఉద్యోగస్తులు తమ కార్యాలయాలకు వెళ్లి వచ్చే సమయాల్లో ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకొని నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఉద్యోగానికి వెళ్లే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో ట్రాఫిక్ విపరీతంగా జాం అవుతోంది. గత కొన్ని రోజుల నుంచి సమస్య ఉన్నప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. సకాలంలో కార్యాలయాలకు వెళ్లలేకపై అధికారులతో చివాట్లు పెట్టించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఉద్యోగస్తులు వాపోతున్నారు. గంట ముందు బయలుదేరినా కానీ సకాలంలో వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లిలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రత్యమ్నాయంగా ఈ రహదారిని అభివృద్ధి చేసినప్పటికి కూకట్‌పల్లిలో కంటే ఈ రహదారిలోనే ఇంకా ఎక్కువగా ట్రాఫిక్ ఉంటుంది. మూసాపేట నుంచి కైత్లాపూర్ మీదుగా మాదాపూర్, హైటెక్ సిటీ, ఐటీ కారిడర్‌కు వెళ్లే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నిత్యం ట్రాఫిక్ నరకాన్ని చవిచూస్తున్నారు.

◆ కూకట్‌పల్లి, జేఎన్‌టియు మీదుగా మాదాపూర్, హైటెక్ సిటీ వెళ్లేందుకు దూరం అవటమే కాక ట్రాఫిక్ కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ప్రత్యమ్నాయంగా మూసాపేట చౌరస్తా నుంచి హైటెక్ సిటికి ఫ్లై ఓవర్ వరకు 100 ఫీట్ల రోడ్డును అభివృద్ధి చేశారు.

◆ కొన్ని చోట్ల చిన్న చిన్న అవాంతరాలు ఉండటంతో భారీగా ట్రాఫిక్ ఏర్పడుతోంది. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు తిరిగి సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు భారీగా ట్రాఫిక్ ఏర్పడుతోంది.

◆ ఐడియల్ చెరువు రంగధాముని ఆలయం దాటిన తరువాత కై త్లాపూర్ బ్రిడ్జి దాటి మూల మలుపు తీసుకునేంత వరకు ట్రాఫిక్ ఉంటుంది.

◆ రంగధాముని ఆలయం నుంచి రెయిన్‌బో విస్టాస్‌కు వెళ్లేందుకు కనీసం గంటకు పైగా పడుతుందని రెయిన్‌బో విస్టాస్ వాసులు వాపోతున్నారు.

◆ అమీర్‌పేట, ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్ ప్రాంతాల నుంచి ఐటి కారిడర్‌కు వెళ్లే సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్ మూసాపేట చౌరస్తా మీదుగా ఇదే రహదారిని ఆశ్రయిస్తుంటారు. కూకట్‌పల్లికి వెళ్లకుండా ఈ రహదారి వెంట ట్రాఫిక్ ఉండకపోవడమే కాక దూరం కూడా తగ్గడంతో ఎక్కువ మంది ఈ దారినే ఎంచుకుంటున్నారు.

◆ అంతేకాకుండా ఇటీవలే కై త్లాపూర్ వద్ద అయ్యప్ప సొసైటీకి వెళ్లేందుకు వీలుగా బ్రిడ్జిని నిర్మించటంతో వాహనదారులు, ఉద్యోగస్తులు ఇంకా ఎక్కువగా ఈ రహదారిలో ప్రయాణిస్తున్నారు. దీంతో మరింత ట్రాఫిక్ పెరుగుతోంది.

◆ రెయిన్‌బో విస్టాస్ దాటిన తరువాత కై త్లాపూర్ ప్రారంభం వరకు రోడ్డు వైండింగ్ కాకపోవటంతో రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనాలు వెళ్లలేక ట్రాఫిక్‌కు కారణమవుతోంది. మరో కారణం కై త్లాపూర్ వద్ద బ్రిడ్జిపై నుంచి వచ్చే వాహనాలను అక్కడ ఉన్న సిగ్నల్స్ తొలగించి యూ టర్న్ ఏర్పాటు చేయటం వల్ల మూసాపేట నుంచి యు టర్న్ తీసుకోకుండా సరాసరి వెళ్లే వాహనాలు, బ్రిడ్జిపై నుంచి వచ్చి యూ టర్న్ తీసుకునే వాహనాలు ఒకేప్రాంతానికి రావటంతో యు టర్న్ తీసుకోవటానికి ఇబ్బందిగా మారటంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. ఈ ప్రాంతంలో ఏదైనా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఈ ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి తమకు విముక్తి కల్పించడని స్థానిక ప్రజలు, వాహనదారులు, ఉద్యోగస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



మూసాపేట నుంచి కైత్లాపూర్‌కు వెళ్లే రహదారిలో ఏర్పడిన భారీ ట్రాఫిక్ (ఫైల్ ఫొటో)



నిత్యం ఇబ్బందులు



సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఇదే రహదారిని ఉపయోగించటంతో స్థానికంగా నివాసం ఉండే ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లి పని చూసుకొని మళ్లీ లోపలకు వెళ్లాలంటే కనీసం గంట సమయం పడుతోంది. ఏదైనా అత్యవసర పని ఉంటే కానీ బయటకు వెళ్లాల్సి వస్తుంది. సరదాగా బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రెయిన్‌బో విస్టాస్ వాసులకే కాక, కైత్లాపూర్, సేవాలాల్ నగర్, రాఘవేంద్ర సొసైటీ వాసులకు కూడా నిత్యం ఇబ్బందులు పడవలసి వస్తోంది.

- మధుసూదన్‌రెడ్డి,రెయిన్‌బో విస్టాస్ అధ్యక్షుడు